సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం ၊ 7 ၊ జనవరి ၊ 2023



అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రం
అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్రం అడ్డుకుంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. - 8లో



వటపత్రశాయిగా నృసింహుడు
యాదాద్రిలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు వటపత్రశాయిగా, పరమపదనాథుడి దర్శనమిచ్చారు. - 8లో

గరిష్టం/కనిష్టం
29.0°/15°
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సంక్రాంతికి పూర్తి చేయాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, భూపాల్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : నిర్మాణం పూర్తయిన ఇళ్ల పంపిణీకోసం సంక్రాంతి వరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎంవీ భూపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమై డబుల్ బెడ్ రూం ఇళ్ల పురోగతిపై సమీక్షించారు. పూర్తయిన ఇళ్లకు సంబంధించి గ్రామ సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీజేపీని అధికారంలోకి తేవడమే ప్రధాన ఎజెండా



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

మోటకొండూర్, ఆత్మకూర్(ఎం) : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే ప్రధాన ఎజెండా అని, పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, ఆలేరు నియోజకవర్గ పాలక్ ములుగూరు భిక్షపతి అన్నారు. శుక్రవారం మోటకొండూరు, ఆత్మకూర్(ఎం)లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నేడు ఆలేరులో పోలింగ్ బూత్ రాష్ట్ర మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళ్లెం రవీందర్‌రెడ్డి, సుదగాని హరిశంకర్‌గౌడ్, పీసరి తిరుమలరెడ్డి, పడాల శ్రీనివాస్, తండ కృష్ణగౌడ్, చిర్ర రవీందర్, గంగారపు నరేష్ పాల్గొన్నారు.

'నవోదయ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : 2023 – 24 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి అర్హత గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ కె.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 – 23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 31లోపు అందజేయాలని తెలిపారు. ఏప్రిల్ 29న పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకోసం navodaya.gov.in ను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు చేసుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం గోదాదేవికి తిరుప్పావై, సాయంత్రం ఆండాల్ అమ్మవారి సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో సేవోత్సవం చేపట్టారు. అనంతరం మండపంలో అమ్మవారికి ఊంజలి సేవ జరిపించారు. ఇక ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి సంప్రదాయ పూజలు చేపట్టారు.

యదాద్రిలో ప్రముఖుల పూజలు



ఎమ్మెల్సీ వాణిదేవికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని శుక్రవారం జార్ఖండ్ శాసనసభ ప్రెస్ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ఆనంద్‌మోహన్, కమిటీ సభ్యులు, రాష్ట్ర ఎమ్మెల్సీ సురభి వాణి దేవి వేర్వేరుగా దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో నిర్వహించిన సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు.

50 శాతం లోపే!

ఆస్తిపన్ను వసూళ్లలో కానరాని పురోగతి
- లక్ష్యం 19.92 కోట్లు.. వచ్చింది రూ.9.36 కోట్లు
- కొత్త మున్సిపాలిటీల్లో స్పందన కరువు
- భువనగిరిలో మాత్రమే కాస్త ఫలితం
- ముంచుకొస్తున్న గడువు.. అవగాహన కల్పించని అధికారులు



ఈనెల 5 వరకు వసూలైన ఆస్తి పన్ను ఇలా..

మున్సిపాలిటీ	లక్ష్యం	వసూలైంది
భువనగిరి	రూ.7.42 కోట్లు	రూ.3.54 కోట్లు
యాదగిరిగుట్ట	రూ.2.10 కోట్లు	రూ. 1 కోటి
చౌటుప్పల్	రూ.5.60 కోట్లు	రూ.2.82 కోట్లు
పోచంపల్లి	రూ.1.79 కోట్లు	రూ.73 లక్షలు
మోత్కూరు	రూ.1.09 కోట్లు	రూ.53.83 లక్షలు
ఆలేరు	రూ.1.92 కోట్లు	రూ.74 లక్షలు

సాక్షి, యాదాద్రి : మున్సిపాలిటీల్లో ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు, పట్టణ ప్రగతి పనుల నిర్వహణకు ఆస్తి పన్నే ప్రధాన ఆదాయ వనరు. అలాంటి పన్ను వసూళ్లలో పురపాలక అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపుకు దశకు వస్తున్నా లక్ష్యం 50 శాతం కూడా చేరలేదు. భువనగిరి మున్సిపాలిటీలో కాస్త స్పందన కనిపిస్తుండగా మిగతా మున్సిపాలిటీలు పూర్తిగా వెనుకబడ్డాయి. పాలకవర్గాలు ప్రత్యేక చర్యలు చేపడితే తప్ప.. లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగానే మారింది.

ఆరు మున్సిపాలిటీలు

జిల్లాలో భువనగిరి, ఆలేరు యాదగిరిగుట్ట, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, మోత్కూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా మున్సిపాలిటీల్లో ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను, పాత బకాయిలు కలిపి రూ.19.92 కోట్ల వరకు వసూలు చేయాల్సి ఉంది. జనవరి 5వ తేదీ నాటికి రూ.9.36 కోట్లుమాత్రమే వసూలైంది. ఇంకా వసూళ్లు చేయాల్సిన బకాయి రూ.10.56 కోట్లకు పైనే ఉంది. మొత్తం 50 శాతం లోపే వసూలు చేశారు.

అధికారుల ఉదాసీనత

గడువు ముంచుకొస్తున్నా ఆస్తి పన్ను వసూళ్లపై మున్సిపల్ యంత్రాంగం ఉదాసీనత వీడడం లేదు. లక్ష్యం చేరుకునేందుకు ఇప్పటికే ఓటీఎస్(వన్‌టైం సెటిల్‌మెంట్) లాంటి స్కీంలు ప్రవేశపెట్టడంతో పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలి. కానీ, ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు ప్రారంభించలేదు. వసూలైన కొద్దిపాటి పన్నులు కూడా ఉద్యోగులు, సిబ్బంది జీతభత్యాలకే సరిపోతుంది. ముఖ్యంగా ఆస్తి పన్ను బకాయిల్లో సింహభాగం ప్రభుత్వ కార్యాలయాలే ఉన్నట్లు తెలుస్తోంది. వీటి విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి.

మందగమనానికి కారణాలివే..

- ఆస్తిపన్ను చెల్లించేందుకు ప్రజలు కూడా ఆశించిన స్థాయిలో ముందుకు రావడం లేదు. వివిధ కారణాల వల్ల వేచి ధోరని అవలంభిస్తున్నారు.
- భువన్ యాప్‌లో సర్వే కొలతలు పెరగడం, ప్రభుత్వం భూమి విలువ పెంచడంతో ఆస్తి పన్ను పెరిగింది. –మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల ప్రజలు పాత పద్ధతిలోనే పన్నులు చెల్లించేందుకు ఆలోచిస్తున్నారు.
- ప్రస్తుతం ఉన్న ఆస్తి పన్నుపై జూలైలో రెండు శాతం ఫెనాల్టీ విధించడం కూడా కారణంగా చెప్పవచ్చు.

100 శాతం వసూలు చేస్తాం



భువనగిరి మున్సిపాలిటీలో 100 శాతం పన్ను వసూలు చేస్తాం. పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేకంగా ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశాం. ఆస్తి పన్ను చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.
–టి.నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

- యాదాద్రి ఆలయ అభివృద్ధిలో భాగంగా యాదగిరిగుట్టలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను తొలగించారు. అయినా వాటికి పన్ను పెండింగ్‌లో చూపుతుంది.
- భువనగిరిలో ప్రధాన రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన యజమానులు గడువు కోరుతున్నారు.
- చౌటుప్పల్ పరిధిలో ప్రభుత్వ భవనాలు, శిథిలమైన ఇళ్లు, మూతపడ్డ పరిశ్రమలతో పాటు పలుకుబడి కలిగిన వ్యక్తుల ఆస్తి పన్ను పెండింగ్‌లో ఉంది.
- ఆస్తి పన్ను చెల్లించాలని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రజలకు అవగాహన కల్పించాలని ఉండగా అధికారులు పట్టించుకోవడం లేదు.

కొత్త ఇళ్లకు నిర్ధారణ కాని పన్ను

మున్సిపాలిటీల్లో కొత్తగా నిర్మించిన కొన్ని ఇళ్లను అసెస్‌మెంట్ చేయకపోవడంతో ఆస్తి పన్ను రావడం లేదు. పలుకుబడి కల్గిన వ్యక్తులు, ప్రజాప్రతినిధులు, ఉన్నత వర్గాల వ్యక్తులు నూతనంగా నిర్మించిన ఇళ్లను భువన్ యాప్‌లో అప్‌లోడ్ చేయడంలేదు. దీంతో లక్షలాది రూపాయల ఆస్తి పన్ను మున్సిపాలిటీలు కోల్పోతున్నాయి.



చండూరు సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రెడ్డి, కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గాదరి కిశోర్, కంచర్ల తదితరులు

పేదల్లో చిరునవ్వే లక్ష్యం

- పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- చండూరులో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన

చండూరు : రాష్ట్రంలో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని రాష్ట్ర ఐటీ, పురపాక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. శుక్రవారం చండూరులో మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. రాబోయే నాలుగైదు నెలల్లో అందమైన చండూరుగా మారుస్తామన్నారు. పట్టణంలో వెజ్, నాన్‌వెజ్, సమీకృత మార్కెట్ ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. చిరు వ్యాపారులకు రూ.50 లక్షలతో మున్సిపల్ కాంప్లెక్స్ పూర్తిచేస్తామని, రూ.2 కోట్లతో మున్సిపాలిటీ భవనానికి, రూ.8.90 కోట్లతో తేరట్‌పల్లి, గట్టుపల్ చేనేత క్లస్టర్లకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు.మర్రిగూడ మండలం శివన్నగూడెం, లక్ష్మాపురం రిజర్వాయర్ల ద్వారా ఈ ప్రాంతానికి సాగు నీటిని అందజేస్తామన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు చండూరు నుంచి కొండమల్లేపల్లి వరకు గల రోడ్డును రూ.90 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

చండూరు సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. మంత్రి మాట్లాడుతున్నంత సేపూ సభికులు కేరింతలు కొట్టారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ఫార్మాను వేరే ప్రాంతానికి తరలించాలి

గట్టుప్పల మండలం పరిధిలో ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీని వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్.. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని ఆదేశించారు. గట్టుప్పలలో రూ.2 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన, రూ.8 కోట్లతో గట్టుప్పల్, తేరట్‌పల్లి ఏర్పాటు చేయనున్న చేనేత క్లస్టర్లకు భూమి పూజ చేశారు. మునుగోడు ఉప ఎన్నికలో గట్టుప్పల్ మండల ఇన్‌చార్జ్‌గా ఉన్నానని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానన్నారు.



చండూరులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్

రూ.3వేల కోట్లతో అభివృద్ధి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ విజయోత్సవ సభలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని, నియోజకవర్గంలో దాదాపు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నా రు. శక్రవారం హుజూర్‌నగర్‌లో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ, ఎమ్మెలే క్యాంప్ కార్యాలయం, సబ్ ట్రెజరీని ఆయన ప్రారంభించారు. తర్వాత అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. నియోజకవర్గంలో కొత్త లిఫ్టులు ఏర్పాటు చేయడంతోపాటు పాతవి, సాగర్ కాల్వల మరమ్మతులకు రూ.2వేల కోట్లు మంజూరు చేసింది కేసీఆర్ ప్రభుత్వం అన్నారు. రెవెన్యూ డివిజన్ కలను నెరవేర్చామన్నారు. ఈ ప్రాంత కార్మికుల కోసం ఈఎస్‌ఐ డిస్పెన్సరీ, పూర్తి స్థాయి ఈఎ స్‌ఐ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదనపు జిల్లా కోర్టు మంజూరైందని, త్వరలోనే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు.

తరగతి గదిలోనే భవిష్యత్‌కు పునాది



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గొంగిడి సునీత, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ లక్ష్మీరాములు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

గుండాల : విద్యార్థుల భవిష్యత్‌కు తరగతి గదిలోనే పునాది పడుతుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమం కింద గుండాల, వెల్మజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం చేపట్టిన అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి నూతన ఒరవడితో విద్యాబోధన చేయిస్తుందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యవంతంగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. అంతకు ముందు విద్యార్థులతో మాట్లాడారు. భవిష్యత్‌లో ఏం అవుతారని ప్రశ్నలు వేశారు.

నిధులు కేటాయించాలని వినతి

రామారం నుంచి కొమ్మాయిపల్లి వరకు ధ్వంసమైన బీటీ రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఎంపీటీసీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని, త్వరలోనే చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాండ్ర అమరావతిశోభన్‌బాబు, జెడ్పీటీసీ కోలుకొండ లక్ష్మీరాములు, ఎంపీటీసీ సంగి అలివేలువెంకటాద్రి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్, సర్పంచ్ సంగి బాలకృష్ణ, చిందం వరలక్ష్మి, దుంపల శ్రీనివాస్, ఎంపీటీసీ మహేష్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ శ్రీధర్, పీఆర్‌డీఈ హేమంత్‌కుమార్, ఏఈలు దామోదర్, అనూష, హెచ్‌ఎంలు గిరివర్ధన్, యాదగిరి, ఉపాధ్యాయులు, మండల కోఆప్షన్ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ పనుల పరిశీలన



కాల్వ పనులను పరిశీలిస్తున్న గొంగిడి సునీత

ఆత్మకూరు(ఎం), మోటకొండూరు : ఆత్మకూరు (ఎం), మోటకొండూరు మండలాల పరిధిలో సొంత ఖర్చులతో చేపట్టిన బునాదిగాని కాల్వ పనులను శుక్రవారం ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పనుల పురోగతిపై చర్చించారు. రైతులతో మాట్లాడారు. ఈ ప్రాంత రైతులకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో కాల్వ పనులను శరవేగంగా చేపడుతున్నామని, రైతులు సహకరించాలని కోరారు. ఆమె వెంట మోటకొండూరు జెడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఆత్మకూర్ (ఎం) మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, రైతు సమితి మండల కోఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి, ఆత్మ రాష్ట్ర డైరెక్టర్ సోలిపురం అరుణ, నాయకులు మామిడి శ్రీనువాసరెడ్డి, మాస సత్తయ్య, కొప్పుల శ్రీనివాస్, ఎండీ బురాన్ ఉన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి : డీఈఓ

సాక్షి,యాదాద్రి : విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం భువనగిరిలో రెండో బ్యాచ్ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులపై విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగడానికి మార్గదర్శనం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంతేకాకుండా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ ఆలోచనలు పెంపొందేలా బోధన చేయాలని, అందుకోసం నిరంతరం నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు కూడా చదువుపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం నిర్వహించిన తొలిమెట్టు వంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాథమిక దశనుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. డీఐఈఓ రమణి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలతో జూనియర్ అధ్యాపకులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. శిక్షణలో చెప్పిన విషయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 200 మంది ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

చిన్నారుల పోషణ స్థితిని గమనిస్తుండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

బీబీనగర్ : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పోషణ స్థితిని గమనిస్తూ ఎప్పటికప్పుడు వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. బీబీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో ఆమె పాల్గొన్నారు. చిన్నారులకు అన్నప్రాసనం, అక్షరాభ్యాసం చేయించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషణలోపం ఉన్న పిల్లలను సూపర్‌వైజరీ ఫీడింగ్‌లో నమోదు చేసి ప్రత్యేక ఆహారం అందజేయాలని సూచించారు. గర్భిణులు, చిన్నారులకు సకాలంలో కోడి గుడ్లు, బాలామృతం అందజేయాలని పేర్కొన్నారు. పోషణ కార్యక్రమాలను మానిటరింగ్ చేసుకోవడంతో పాటు డాష్ బోర్డులో వివరాలు ఎంట్రీ చేయాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలని గర్భిణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూడీ అధికారి కృష్ణవేణి, ఐసీడీఎస్ సీపీడీఓ స్వరాజ్యం, సూపర్‌వైజర్ లలిత, అంగన్‌వాడీ కార్యకర్త షాహేదాబేగం, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

వలిగొండ : గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్యే ఎలిమినేటి కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. వలిగొండ మండలం సంగెంలో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం, నాతాళ్లగూడెం, గోకారంలో బీసీ కమ్యూనిటీహాళ్లకు శంకుస్థాపన, జాలుకాల్వలో ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న బాత్‌రూంలను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. గత పాలకులు గ్రామాలను పట్టించుకోలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాల్ నర్సింహ, జెడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, సర్పంచ్‌లు కీసరి రాంరెడ్డి, తుర్కపెల్లి మాధవి సురేందర్, ఉలిపే మల్లేశం, మద్దెల సందీప్, ఎంపీటీసీ లు మోటే నర్సింహ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, వలిగొండ పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎలిమినేటి కృష్ణారెడ్డి, సందీప్‌రెడ్డి

మోత్కూరుకు నూతన శోభ

- ముమ్మరంగా అభివృద్ధి పనులు
- పూర్తి కావొచ్చిన డివైడర్లు, సెంట్రల్ లైటింగ్
- గ్రీనరీ ఏర్పాటుకు సన్నాహాలు



కొత్త బస్టాండ్ వైపు పూర్తయిన డివైడర్ నిర్మాణం



భువనగిరి రోడ్డుపై సెంట్రల్ లైటింగ్

మోత్కూరు : ప్రధాన రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్.. ఇలా పలు రకాల అభివృద్ధి పనులతో మోత్కూరు నూతన శోభను సంతరించుకుంటోంది. రూ.2కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన ఈ పనుల్లో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పూర్తి కావొచ్చింది. అనంతరం సుందరీకరణ కోసం గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ నిధులను రూ.కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో ప్రధాన రోడ్డును విస్తరిస్తున్నారు. ప్రధాన రోడ్ల మధ్యలో 6 ఫీట్ల వెడల్పు, 3 ఫీట్ల ఎత్తుతో డివైడర్లు నిర్మిస్తున్నారు.1.6 కిలో మీటర్ల దూరం నిర్మిస్తుంగా పనులు పూర్తికావొచ్చాయి. ఇక మూడు ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ వేస్తున్నారు. భువనగిరి రోడ్డులో అంబేద్కర్ చౌరస్తా నుంచి పనకబండ చౌరస్తావరకు, అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్‌ల నుంచి జగ్జీవన్‌రామ్ చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ వరకు, నార్కట్‌పల్లి రోడ్డులో అంబేద్కర్ చౌరస్తా నుంచి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. లైట్ల ఏర్పాటుకు 118 స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు.భువనగిరి, నార్కట్‌పల్లి వైపు పనులు పూర్తయ్యాయి. మెయిన్ రోడ్డు వెంట స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సెంట్రల్ లైటింగ్‌ను సంక్రాంతికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

త్వరలో గ్రీనరీ ఏర్పాటు

గ్రీనరీతో రోడ్లు అందంగా దర్శనమీయనున్నాయి. డివైడర్ల మధ్య వివిధ రకాల చెట్లు, పూల మొక్కలు ఏర్పాటు చేయనున్నారు.

సంక్రాంతికి ప్రారంభిస్తాం



ప్రధాన రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో మోత్కూరు పట్టణం నూతన శోభను సంతరించుకోనుంది. రాత్రి వేళల్లో ప్రధాన రోడ్లపై ఎల్ఈడీ వెలుగులు విరజిమ్మనున్నాయి. వీటిని సంక్రాంతికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.
– తీపిరెడ్డి సావిత్రి, మున్సిపల్ చైర్‌పర్సన్

ఇబ్బందులు తొలగనున్నాయి



ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తున్నాం. మెట్లు, అరుగులు, వరండాలు తీసివేయిస్తున్నాం. దీంతో పట్టణంలో సెంట్రల్ లైటింగ్ సంపూర్ణంగా కనిపించనుంది. రాత్రి వేళల్లో వాహనదారుల ఇబ్బందులు తొలగుతాయి. సంక్రాంతి వరకు లైట్లను ప్రారంభిస్తాం.
– శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు

క్లుప్తంగా

మూడు క్వింటాళ్ల కందులు వరదపాలు



బురదలో కందులు

మోత్కూరు: యాదాద్రి జిల్లా మోత్కూరులో అకాల వర్షానికి కందులు వరదలో కొట్టుకుపోయాయి. మోత్కూరు మున్సిపాల్టి పరిధిలోని జామచెట్లబావి గ్రామానికి చెందిన దబ్బెటి రమేష్‌కు చెందిన సుమారు 18 క్వింటాళ్ల కందులు గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షంతో తడిశాయి. తీవ్ర వరద ప్రభావంతో అందులోని మూడు క్వింటాళ్ల కందులు కొట్టుకుపోయాయి. వ్యవసాయ బావికి సమీపంలోని రాముని బండ వద్ద ఆరబోసిన కందులు.. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి వరదలో కొట్టుకుపోయాయి.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు



నిందితులను చూపుతున్న అధికారులు

నల్లగొండ క్రైం : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను టూటౌన్ పోలీస్‌లు అరెస్ట్ చేసి వారి నుంచి కిలోన్నర గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సోమిడి సంతోష్‌రెడ్డి, రాక్‌హిల్స్ కాలనీకి చెందిన మెడబోయిన చక్రి ఇద్దరు కలిసి విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి పట్టణంలో విక్రయిస్తున్నారు. దీంతో పోలీసులకు నమ్మదగిన సమాచారం అందడంతో వెతుకుతుండగా పోలీసులను చూసిన నిందితులు పారిపోయారు. దీంతో వారిని వెంబడించి పట్టుకుని, రెవెన్యూ అధికారుల సమక్షంలో గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం వారిని విచారించగా విద్యుత్‌నగర్‌కు చెందిన రాబిన్ అలియాస్ సాయి, వీటీ కాలనీకి చెందిన సంతోష్, సహజ్‌రెడ్డి, పద్మానగర్‌కు చెందిన సాయిగణేష్‌లతో కలిసి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు పట్టుబడిన నిందితులు వెల్లడించారు. మిగతా వారికోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలిపాలని ఆయన కోరారు.

వటపత్రశాయిగా నృసింహుడు

- రాత్రి పరమపదనాథుడిగా దర్శనమిచ్చిన యాదాద్రీశుడు
- నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట : వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీస్వామి వారు ఉదయం భక్తులకు వటపత్రశాయిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రథమ ప్రాకార మండపంలో వటపత్రశాయి అలంకార సేవకు ఆచార్యులు హారతినిచ్చారు. అనంతరం సేవను ఆలయ తిరువీధుల్లో, మాఢవీధుల్లో ఊరేగించారు. ఈ సేవలకు ముందు ఆచార్యులు, పారాయణికులు శాస్త్రోక్త పూజలతో, దివ్య ప్రబంధ పారాయణాలతో శ్రీస్వామిని కొలిచారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, జార్ఖండ్ శాసనసభ ప్రెస్ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ఆనంద్ మోహన్, కమిటీ సభ్యులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, అశోక్‌కుమార్, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, ప్రధానార్చకులు, రుత్వికులు, పారాయణీకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వటపత్రశాయి అలంకార సేవ ముందు ప్రబంధ పారాయణం పఠిస్తున్న ఆచార్యులు



వైకుంఠనాథుడి అలంకార సేవలో శ్రీస్వామివారు

రాత్రికి పరమపదనాథుడిగా..

ఆలయంలో నిత్యారాధనల అనంతరం అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి శ్రీస్వామి వారిని పరమపదనాథుడిగా (వైకుంఠనాథుడిగా) అలంకరించి సేవోత్సవం చేపట్టారు. ప్రధానాలయంలో ద్రావిడ ప్రబంధ సేవాకాలంతో పారాయణిక స్వాములచే, అర్చక స్వాములచే అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దివ్య మనోహరంగా వైకుంఠనాథుడిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుత్ కాంతుల వెలుగులో శ్రీస్వామి వారు తిరువీధి సేవకు వెళ్లి భక్తులకు దర్శనం కల్పించారు.

నేటితో ఉత్సవాలు ముగింపు..

అధ్యయనోత్సవాలలో భాగంగా శనివారం శ్రీస్వామివారు శ్రీనరసింహస్వామి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో చివరి రోజు శ్రీనరసింహస్వామి అలంకార సేవతో ముగియనున్నట్లు ఆలయ ఆచార్యులు తెలిపారు.

పట్టువస్త్రాల బహూకరణకు అనుమతి ఇవ్వాలని వినతి

భూదాన్‌పోచంపల్లి : యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణానికి పోచంపల్లి పట్టువస్త్రాల బహూకరణకు అనుమతి ఇవ్వాలని శుక్రవారం పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో దేవస్థానం ఈఓ గీతారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు ఈఓ స్పందించి మాట్లాడుతూ.. పోచంపల్లి ఇక్కత్‌పట్టు వస్త్రాలను అందజేసేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రత్యేక జీఓ జారీ చేసిందని తెలిపారు. ఇందుకు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఈఓకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, భోగ నర్సింహ, అంకం మురళి, భారత బాలరత్నం, కడవేరు చంద్రమౌళి, సంగెం చంద్రయ్య, వనం మల్లేశం, గుండు పాండు, కర్నాటి అంజమ్మ, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



దేవస్థానం ఈఓ గీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : విద్యుత్ ఉద్యోగులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన యోగా, ప్రాణాయామంపై సూర్యాపేట డివిజన్ విద్యుత్ ఉద్యోగుల ప్రత్యేక శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఈ పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం చేయాలన్నారు. నియమ నిబంధనలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు

- మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగింత



అమన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ముస్లిం యువకులు

పెద్దవూర : మండల కేంద్రంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానిక ముస్లిం యువకులు చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎండీ.జానిమియా అలియాస్ పోస్ట్ జానీ, పలువురు ముస్లిం యువకులు మండల కేంద్రంలో నాలుగైదు నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని చేరదీశారు. రోజు అతడికి భోజనం పెడుతూ దగ్గరికి తీశారు. ఈ క్రమంలో అతడితో మాటల్లో మాటలు కలుపుతూ పేరు, ఊరు అడిగేవారు. ఒక రోజు తన పేరు అమన్ అని, మాది మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ అని చెప్పాడు. దీంతో జబల్‌పూర్‌కు చెందిన ఫోన్ నంబర్లను తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో అమన్ కుటుంబ సభ్యులు గురువారం రాత్రి పెద్దవూర వచ్చారు. అమన్ పరిస్థితిని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. కుమారుడు అమన్ 8నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, అతడి కోసం వెతకని రోజు లేదని, కుమారుడు కనిపించలేదని తీవ్ర మానసిక వేదనతో అతడి తండ్రి సిరాజ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అమన్ ఆచూకీ తెలిపిన జానీమియాకు, ముస్లిం యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



అరుణను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి : భర్త వేధింపులు తాళలేక ఇంటి నుంచి వెళ్లిన భార్య, ముగ్గురు పిల్లల మిస్సింగ్ కేసును శుక్రవారం స్థానిక పోలీసులు ఛేదించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గుర్రు నరేశ్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు నిత్యం మద్యం సేవించి వచ్చి భార్య అరుణను కొడుతున్నాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా భార్యాభర్తలు గొడవ పడ్డారు. భర్త వేధింపులు తాళలేక తీవ్ర మనస్థాపానికి గురైన అరుణ గురువారం సాయంత్రం భర్త ఇంట్లో లేని సమయంలో తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం భర్త ఇంటికి వచ్చి చూసి వెతకగా భార్య, పిల్లలు కన్పించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో వారు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అరుణ చౌటుప్పల్ మండలం లక్కారం వద్ద పిల్లలతో ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం పోలీసులు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం భార్య భర్తలకు గొడవ పడకుండా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కేసును 24గంటల్లో ఛేదించిన ఏఎస్‌ఐ సైదిరెడ్డి, కానిస్టేబుల్ యాదగిరిని ఎస్‌ఐ అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటున్న కేంద్రం

- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



మోత్కూరు : సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు : తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగానికి ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, పంట రుణాల మాఫీ, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో బీజేపీ ప్రభుత్వాలపై భారం పడుతుందని కేంద్రం భయపడుతుందన్నారు. పక్క రాష్ట్రాలు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ వస్తుందన్నారు. 9నెలల్లో ఎన్నికలు రావొచ్చని, రెండు, మూడు గ్రామాలకు కలిపి వన భోజనాల ద్వారా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని అన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బి.కల్యాణ్‌చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి, వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.మేఘారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రాంపాక నాగయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెడిపల్లి రఘుపతి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మల్లం అనిత, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు ఉన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషిచేయాలి

అడ్డగూడూరు : బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 8న మండలంలో చౌల్లరామారం శివారులో నిర్మించిన గిడ్డంగుల గోదాముల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ దర్శనాల అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, సోన్నాల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, నాయకులు తదతరులు పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

భూదాన్‌పోచంపల్లి : కాలనీభూములపై రైతుబంధు నగదు తీసుకుంటున్న పట్టణానికి చెందిన వెదిరె అరవిందారెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో చేనేత కార్మిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వెదిరె అరవిందారెడ్డి తన తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన 433, 434, 435 సర్వేనంబర్‌లలో గల 28.17ఎకరాల భూమిని గతంలో ప్లాట్లు చేసి విక్రయించాడని, దీంతో అక్కడ రాంనగర్ కాలనీలు- ఫేజ్1, ఫేజ్-2 లు ఏర్పడి ప్రజలు చాలా ఏళ్లుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. అయితే ధరణి పోర్టల్‌లో అతడి పేరున భూమి చూపిస్తుండటంతో ఇప్పటి వరకు వెదిరె అరవిందారెడ్డి రైతుబంధు, పీఎం కిసాన్ యోజన కింద రూ.11,08,575ల డబ్బులు తీసుకొని ప్రభుత్వాన్ని మోసం చేశాడని ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ జరిపి, అతడి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని రద్దు చేయాలని కోరుతూ ఇటీవల కలెక్టర్, రెవెన్యూ ప్రిన్సిపల్, రాచకొండ సీపీ, తహసీల్దార్‌కు వేర్వేరుగా వినతిపత్రాన్ని అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏలే భిక్షపతి, చింతకింది రమేశ్, శశికళ తదితరులు ఉన్నారు.

ఓర్వలేకనే ఫోన్ ట్రాప్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఎస్పీ నాయకులు

భువనగిరిటౌన్ : రాష్ట్రంలో బీఎస్పీకి లభిస్తున్న ఆధరణ చూసి ఓర్వలేని రాష్ట్ర ప్రభుత్వం.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌ను ట్రాప్ చేశారని ఆ పార్టీ భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బందారు రవివర్ధన్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యహరిస్తున్న తీరుపై శుక్రవారం భువనగిరిలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఎస్పీ ఎదుగుదలను ఎవ్వరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాసాని మహేందర్, అనిల్‌కుమార్, రమచంద్రయ్య, దాసు, సంతోష్, సరిత, కృష్ణ, నవీ, జహంగీర్, రజిత పాల్గొన్నారు.

పట్టణంలో భూ కబ్జాలను అరికట్టాలి

- మంత్రులకు విన్నవించిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలో జరుగుతున్న భూ కబ్జాలను అరికట్టాలని మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలకు విన్నవించినట్లు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని వందల కోట్ల రూపాయల మున్సిపాలిటీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వాటిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మంత్రలకు వివరించినట్లు ఆయన తెలిపారు. మఠంపల్లి మండలంలో వందల కోట్ల విలువైన 46ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకోవడానికి ఏమి ఇబ్బంది అని మంత్రులను, అధికారులను అడిగితే వాపస్ తీసుకుంటామని చెప్పారని తెలిపారు. లిస్ట్ ఆఫ్ ల్యాండ్స్‌ను తయారు చేయాలని ఆదేశించి దానిని నోటీస్ బోర్డుపై పెట్టాలని ఆదేశించారని ఆయన అన్నారు. ఆరు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్ కంప్యూటర్ లాగిన్ దొంగలించిన విషయంపై మంత్రులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ ప్రాంతంలో అన్ని లిఫ్టులు నా హయాంలోనే నిర్మాణాలు జరిగాయని తెలిపారు. హుజూర్‌నగర్‌లో 50వేల ఓట్ల మెజార్టీతో ఈ సారి మేమే గెలువబోతున్నామని, ఇందులో ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్, యరగాని నాగన్న, సాముల శివారెడ్డి, భూక్యా గోపాల్, ఎండీ నిజాముద్దీన్, అరుణ్‌కుమార్, అల్లం ప్రభాకర్‌రెడ్డి, మోతీలాల్, కొట్టె సైదేశ్వరరావు, అజీజ్ పాషా, మహేష్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు

- కోదాడ అనురాగ్ కళాశాల మొదటి స్థానం, నాగార్జునసాగర్ ద్వితీయ స్థానం



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలల ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. ఈ క్రీడల్లో కోదాడ అనురాగ్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలువగా నాగార్జునసాగర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కబడ్డీ బాలికల విభాగంలో కిట్స్ కోదాడ విజేతగా నిలువగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది. బాలుర విభాగంలో జీపీటీ నాగార్జునసాగర్ టీమ్ విజేత కాగా, జీపీటీ నల్లగొండ రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ బాలికల విభాగంలో జీపీడబ్ల్యూ సూర్యాపేట టీమ్ విజేతగా, కిట్స్ కోదాడ రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల కోదాడ విజేతగా, జీపీటీ నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. ఖోఖో బాలికల విభాగంలో జీపీడబ్ల్యూ విజేత కాగా, జీపీటీ నల్లగొండ రన్నర్‌గా నిలిచింది. ఖోఖో బాలుర విభాగంలో జీపీటీ నల్లగొండ విజేతగా నిలువగా, జీపీటీ నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. చెస్ బాలికల విభాగంలో కిట్స్ కోదాడ విజేతకాగా, జీపీడబ్ల్యూ సూర్యాపేట రన్నర్‌గా నిలిచింది. చెస్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా నిలువగా, జీపీటీ రన్నర్‌గా నిలిచింది. టేబుల్ టెన్నీస్ సింగల్ బాలికల, బాలుర విభాగంలో విజేతగా అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల, రన్నర్‌గా నాగార్జునసాగర్ కళాశాల నిలిచింది. టేబుల్ టెన్నీస్ బాలుర, బాలికల విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా నిలువగా, రన్నర్‌గా జీపీడబ్ల్యూ సూర్యాపేట, జీపీటీ తిరుమలగిరి నిలిచాయి. బ్యాడ్మింటన్ సింగల్ బాలికల విభాగంలో జీపీటీ నల్లగొండ విజేత కాగా, నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ సింగిల్ బాలుర విభాగంలో నాగార్జునసాగర్ విజేతగా నిలువగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ డబుల్ బాలికల విభాగంలో జీపీటీ నల్లగొండ విజేతకాగా, అనురాగ్ కళాశాల రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ డబుల్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



బాణావత్ కళ్యాణ్ మృతదేహం

డిండి : అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధిలోని దేవత్‌పల్లితండాకు చెందిన బాణావత్ కళ్యాణ్(36)కు మండలంలోని పద్దతండాకు చెందిన దేవితో 17ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి కళ్యాణ్ గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 4ఏళ్లుగా దంపతుల మధ్య జరుగుతున్న కుటుంబ కలహాలతో కళ్యాణ్ గ్రామంలో ఉంటుండగా దేవి హైదరాబాద్‌లో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 3న దేవి తల్లీగారి గ్రామమైన పెద్దతండాకు వచ్చింది. కాగా అదే రోజు రాత్రి కళ్యాణ్‌ను పెద్దతండాకు రావాలని దేవి కుటుంబ సభ్యులు కోరడంతో అతడు అక్కడికి చేరుకున్నాడు. ఈ క్రమంలో 4వ తేదీ తెల్లవారుజామున కళ్యాణ్ నిద్ర నుంచి లేవడంలేదని దేవితో పాటు ఆమె తల్లిదండ్రులు కళ్యాణ్ సోదరులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకొని 108లో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే కళ్యాణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కళ్యాణ్ అనుమానస్పదంగా మృతి చెందాడని మృతుడి సోదరుడు దూబ్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కత్రావత్ భద్యా, కత్రావత్ నారి, కాత్రావత్ భాస్కర్, స్వామి, చిన్నాతో పాటు మృతుడి భార్య దేవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.సురేష్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 24లీటర్ల నాటుసారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం



పట్టుబడిన నిందితులు, సారాతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పడమటితండా, దుగ్యాల గ్రామాల్లో శుక్రవారం నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500లీటర్ల పానకం, 24లీటర్ల నాటు సారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీశంభు ప్రసాద్, ఏఈఎస్ కిషన్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుగ్యాల, పడమటితండాలో దాడులు నిర్వహిస్తుండగా పడమటితండాకు చెందిన రమావత్ వెంకటేష్, కమిలియాలు ద్విచక్రవాహనంపై నాటుసారాను తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో సారా స్థావరాలపై దాడులు నిర్వహించగా 1500లీటర్ల పానకం, 24లీటర్ల నాటుసారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా 1500లీటర్ల పానకం డ్రమ్ములను ధ్వంసం చేసి, 24లీటర్ల సారా, 84కిలోల , 60కేజీల నల్లబెల్లం, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో సీఐలు భరత్‌భూషన్, రాఘవీణ, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, పాగరాజు, ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట సేవా పురస్కారానికి వెంకటాచారి ఎంపిక



వెంకటాచారి

రాజాపేట : మండలంలోని రఘునాథపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గడగోజు వెంకటాచారి సేవలను గుర్తించిన పుడమి సాహితీ వేదిక శుక్రవారం విశిష్ట సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. సాహితీ వేదిక తెలుగు తేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారాన్ని ఈనెల 8వ తేదీన నిర్వహించే సంస్థ 4వ వార్షికోత్సవంలో ఆ సంస్థ అధ్యక్షుడు చిలుగుల బాల్‌రెడ్డి అందించనున్నారు.

మోతీరాంతండాలో బాల్య వివాహం

తుర్కపల్లి : మండలంలోని మోతీరాంతండాలో బాల్య వివాహం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గత సంవత్సరం డిసెంబర్ 30న తండాలోని ఎల్లమ్మగుడిలో పెద్దతండాకు చెందిన 16ఏళ్ల బాలికకు మోతీరాంతండాకు చెందిన 17సంవత్సరాల అబ్బాయితో వివాహం జరిగింది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో తండాకు వెళ్లి విచారణ చేపట్టగా ఇరుపక్షాల బంధువులు నూతన జంటను దాచి పెట్టి జనగామ జిల్లాలోని బంధువుల ఇంటికి తరలించినట్లు సమాచారం తెలుస్తుంది. శుక్రవారం రోజున పెళ్లి కూతరు పేరు మీద 10గుంటల భూమిని కూడా రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. ఈ విషయం ఐసీడీఎస్ అధికారులుకు తెలియకపోవడం గమనార్హం.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate



FOR SALE
■ నల్లగొండ పట్టణం చర్లపల్లి చంద్రగిరి విలాస్ కాలనీలో ఫ్లాట్ నెం. 209, 300 చ॥గ॥ లు G+1 సౌత్,ఈస్ట్ అన్ని వసతులు గల ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 9396621354, 7288067687 [Y-772720]

■ మిర్యాలగూడలో MLG to HYD హైవే పైన అన్ని సౌకర్యములతో అభివృద్ధి చేయబడి, రన్నింగ్ కండీషన్ ఉన్న పెట్రోల్ బంక్ అమ్మకానికి కలదు. వివరాలకు. సంప్ర. 99127 38000, 9010975003 [HA-830]

LAND FOR SALE
■ గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు. క్లబ్ హౌస్ కూడకలదు. ఫోన్ : 9951297569. [HA-868]

Wanted
■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k, ఏజెంట్ కమీషన్ 3k. ఫోన్: 9640300074. [HA-844]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776250]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మా కంపెనీ ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ వ్రాయుటకు స్త్రీ / పురుషులు అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్: 76748 10229 [V- 5599]

■ "వివి" కంపెనీ నందు P/T, F/T, M/F కావలెను. Q : ఇంటర్, డిగ్రీ, B.Tech, MBA, గృహిణులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ ఏజ్ : 19+ P/T 8వేలు, F/T 25వేలు సంపాదించే అవకాశం ✆ 62814 66281 [B-1645]

Services

BUSINESS OFFER
■ ట్రాక్ ఆన్ కొరియర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ & ఆంధ్ర ఏరియాల్లో ఫ్రాంచైజీలు ఇవ్వబడును. Ph: 8977627877 / 8801459149 / 8448185066, ravi.kg@trackon.in [H-786775]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకట నలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.